క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: లా ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిక్షణకోసం ఆసక్తిగల న్యాయవాద పట్టభద్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ అభివృద్ధి అధికారి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల శిక్షణ వ్యవధిగల కోర్సులో 8 మందికి అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. రెండు లక్షలకు మించని వార్షికాదాయం, 35 ఏళ్లలోపు వయసు, బార్ కౌన్సిల్‌లో నమోదై ఉండడం ప్రధాన అర్హతలుగా పేర్కొన్నారు. ఆసక్తి గల లా పట్టభద్రులు https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందించాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ. 3 వేల స్టైఫండ్, పుస్తకాలు, ఫర్నిచర్ కోసం రూ.50వేలు మంజూరు చేస్తామన్నారు.

ముస్తాబాద్: బీడీ కార్మికుల పిల్లలకు కేంద్ర మంత్రిత్వశాఖ ద్వారా ఉపకార వేతనాలు అందించేందుకు 2024–25కు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ముస్తాబాద్ కేంద్ర బీడీ కార్మిక వైద్యాధికారి డాక్టర్ విక్రమ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రీమెట్రిక్ (ఒకటి నుంచి పదో తరగతి), పోస్ట్ మెట్రిక్ (ఇంటర్ నుంచి ప్రొఫెషనల్ డిగ్రీ) చదివే బీడీ కార్మికుల పిల్లలు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆగస్టు 31వ తేదీలోగా Scholarships.gov.in సంప్రదించాలన్నారు.

విధులు బహిష్కరణ



కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న అడ్వకేట్లు

వేములవాడ: సిద్దిపేటకు చెందిన రవికుమార్ అనే అడ్వకేట్‌పై పోలీసులు దాడి చేయడాన్ని నిరసిస్తూ వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం కోర్టు విధులు బహిష్కరించి గేటు ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు గుడిసె సదానందం మాట్లాడుతూ అడ్వకేట్లపై దాడులను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. న్యాయవాదులు అవధూత రజనికాంత్, పొత్తూరి అనిల్‌కుమార్, విద్యాసాగర్‌రావు, నాగుల సంతప్, కిషోర్‌రావు, పెంట రాజు, అన్నపూర్ణ, సత్యనారాయణరెడ్డి, రాజ్‌కుమార్, మనోహర్, శ్రీనివాస్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న వాహనదారుల కష్టాలు



సీసీరోడ్డు వేయిస్తున్న మున్సిపల్ అధికారులు

వేములవాడ: వేమలవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నివాసానికి వెళ్లే రహదారి గుంతలు, బురదమయంగా మారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పలుసార్లు 'సాక్షి'లో కథనాలు ప్రచురితమయ్యాయి. స్పందించిన మున్సిపల్ కమిషనర్ అన్వేష్ సిబ్బందితో గురువారం సీసీరోడ్డు వేయించారు. దీంతో వాహనదారుల ఇబ్బందులు తప్పాయి. మున్సిపల్ అధికారులకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

నిరంతర తనిఖీలు చేపడుతాం



కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల పరిసరాల్లో నిరంతర వాహనాల తనిఖీ చేపడుతామని ఎస్సై ఆంజనేయులు అన్నారు. మండలంలోని నిజామాబాద్‌లోని ఎల్లమ్మ ఆలయ ఆవరణలో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ మండలంలోని ప్రధాన రహదారులపై నిరంతరం వాహనాల తనిఖీలు చేపడుతామన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, లేకపోతే జరిమానాలు విధిస్తామన్నారు.

మోహన్ రెడ్డిని కలిసిన నాయకులు



రుద్రంగి: తెలంగాణ స్టేట్ కోపరేటీవ్ లిమిటెడ్ చైర్మన్‌గా హైదరాబాద్‌లో గురువారం బాధ్యతలు స్వీకరించిన మానాల మోహన్ రెడ్డిని మానాల కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో రుద్రంగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూము జలపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

వేములవాడరూరల్: మండలంలోని మర్రిపల్లి గ్రామంలో మాలసంఘం ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వహించారు. ఇంటింటా బోనాలతో డప్పుచప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కులపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

ఇరుకు గదులతో ఇబ్బంది



ఒకే గదిలో వంట సామగ్రి, చిన్నారులు



నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ భవనం

- అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు కరువు
- పాఠశాల తరగతి గదిలో వంటలు, బోధన
- మరుగుదొడ్లు, మూత్రశాలలు లేక తిప్పలు
- పదేళ్లుగా మండలకేంద్రంలో ఇదే పరిస్థితి

ముస్తాబాద్: ఒకే గదిలో వంట చేయడం, విద్యార్థులకు బోధన చేసే టీచర్లు, అందులోనే పౌష్టికాహారం కోసం వచ్చే బాలింతలు, గర్భిణులు, బియ్యం, ఇతర సామగ్రితో స్టోర్ రూంను తలపించేలా ఉంది అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి. మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు ఇరుకు గదుల్లో కొనసాగుతున్నాయి. పదేళ్లుగా ఒకే గదిలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించడంతో కేంద్రానికి వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు.

నిర్మాణంలో భవనాలు..

ముస్తాబాద్ ఎమ్మార్సీ భవనం వద్ద ఐదేళ్ల క్రితం చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు పూర్తికాలేదు. స్లాబ్‌లెవల్ వరకు పనులు పూర్తిచేసి, నిధులు సరిపోక వదిలేశారు. ఇందిరమ్మ కాలనీలో నిర్మిస్తున్న భవనం చివరిదశలో ఉండగా, భవనాన్ని ఇంకా అప్పగించలేదు. జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని తరగతి గదిలోనే నాలుగు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. నాలుగు రోజులక్రితం రెండు కేంద్రాల ను మరో గదిలోకి తరలించారు. అయినా గదుల కొరతతో కేంద్రాలకు వచ్చేవారు ఇక్కట్లు పడుతున్నారు. వంట చేయడం, బోధన చేయడం, ఇతర సామగ్రి ఒకేగదిలో ఉంచడంతో స్టోర్ రూంలాగా మారింది.

వసతులు కరువు

మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు 3, 4లను ఒక గదిలో నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం నెం.3లో ఎనిమిది మంది విద్యార్థులు, గర్భిణులు 12 మంది, బాలింతలు 8 మంది ఉన్నారు. అంకేంద్రం నెం.4లో విద్యార్థులు 70 మంది, గర్భిణులు 10 మంది, బాలింతలు 12 మంది ఉండగా కేంద్రం నెం.5లో పదిమంది విద్యార్థులు, 12 మంది గర్భిణులు, నలుగురు బాలింతలు ఉన్నారు. అంగన్‌వాడీ కేంద్రం నెం.6లో ముగ్గురు విద్యార్థులు, నలుగురు గర్భిణులు, ముగ్గురు బాలింతలున్నారు. అంగన్‌వాడీ కేంద్రం 6లో టీచర్ ఇటీవలే రిటైర్డ్ కాగా పోస్టు ఖాళీగాఉంది. కేంద్రం నెంబర్ 5లో ఆయా పోస్టు ఖాళీగా ఉంది. మూత్రశాలలు, మరుగుదొడ్లు, నీటి వసతి సౌకర్యం లేదు. పౌష్టికాహారం, భోజనాలు, పాల పంపిణీ, వాటిని నిల్వచేయడం ఇబ్బందిగా ఉందని అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు.

భవనాలు నిర్మించాలి



మండలకేంద్రంలో నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేవు. వెంటనే భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి. పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగపడే అంగన్‌వాడీలను బలోపేతం చేయాలి.

– ఎదునూరి గోపి, ముస్తాబాద్

వసతులు కల్పించాలి



అంగన్‌వాడీ కేంద్రంలో వసతులు కల్పించాలి. మరుగుదొడ్లు లేవు. నీటి వసతి కల్పించాలి. పిల్లలు ఉన్న వద్దే వంటలు చేస్తున్నాం. చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. అయినా ఎవరికీ ఇబ్బంది కలగకుండా చూసుకుంటున్నాం.

– బాల్‌రాజవ్వ, ఆయా, ముస్తాబాద్

ప్రతిపాదనలు పంపాం



నిర్మాణంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను పూర్తిచేస్తాం. ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో భవనాలు నిర్మించేందుకు నివేదిక కోరగా ప్రతిపాదనలు పంపాం. వచ్చేనెలలో మండలకేంద్రానికి ఆరు వరకు భవనాలు మంజూరయ్యే అవకాశం ఉంది.

– లక్ష్మిరాజం, డీడబ్ల్యూవో

అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

సిరిసిల్లటౌన్: మున్సిపాలిటీలో పాలకుల అండతో అక్రమాలు పెరుగుతున్నాయని ఏఐఎఫ్‌టీయూ న్యూ పార్టీ రాష్ట్ర నాయకుడు సోమిశెట్టి దశరథం విమర్శించారు. సిరిసిల్ల శివారులోని మినీస్టేడియం పక్కనే నిర్మించిన ప్రహరీని కూల్చాలని గురువారం ఆందోళన చేపట్టారు. సుమారు పదకొండు ఎకరాల స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రహరీ నిర్మాణం జరిగిందన్నారు. గతంలో నిరుపేదలు కట్టుకుంటే కూల్చిన బల్దియా అధికారులు, పాలకులు ఈ విషయంలో ఎందుకు స్పందించడం లేదన్నారు. బాధ్యులపై రెండ్రోజుల్లో చర్యలు తీసుకోవాలన్నారు. నాయకులు మచ్చ అనసూయ, జక్కని త్రివేణి, బొద్దుల శ్రీహరి, తడుక రాములు, సత్యనారాయణ, తారకరాములు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరుచేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ సర్పంచులు

బోయినపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయించాలని పలు గ్రామాల మాజీ సర్పంచులు గురువారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, డీపీవో వీరబుచ్చయ్య, ఎంపీడీవో బీమా జయశీలకు వినతిపత్రం అందజేశారు. సర్పంచుల పదవీకాలంలో ప్రభుత్వం నుంచి నిధులు రాకున్నా, పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులు పూర్తిచేసి ప్రభుత్వానికి అప్పగించినా నేటికి పెండింగ్ బిల్లులు రాలేదని తెలిపారు.

విద్యార్థులున్నా.. ఉపాధ్యాయులేరీ?

- బొప్పాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 455 విద్యార్థులకు 12మందే ఉపాధ్యాయులు
- పూర్తికాని అదనపు తరగతి గదుల నిర్మాణం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు



ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని రాచర్లబొప్పాపూర్‌లోని జెడ్పీ హైస్కూల్‌లో 455 విద్యార్థులకు 12 మంది మంది మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. ఫిజిక్స్, సాంఘిక శాస్త్రం బోధించేందుకు ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. హిందీ బోధకులు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఇంగ్లిష్ టీచర్ల సైతం ఇద్దరికి ఒక్కరే ఉండగా వారు దీర్ఘకాలిక సెలవులో ఉన్నారు. ప్రస్తుతం పాఠశాలకు నలుగురు ఉపాధ్యాయులు అత్యవసరం ఉంది. 'మన ఊరు –మనబడి' కింద అదనపు తరగతి గదుల నిర్మాణం కూడా స్లాబ్ వరకే పరిమితమైంది. కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదని మధ్యలో పనులు నిలిపివేశారు, గతంలో అటెండర్‌గా పనిచేసిన వంగల నర్సయ్య ఏప్రిల్ నెలలో రిటైర్మెంట్ పొందారు. అతని స్థానంలో మరో అటెండర్ అవసరం ఉంది. కానీ ఇప్పటివరకు ఎవరూ రాలేదు. విద్యాధికారులు వెంటనే స్పందించి ఉపాధ్యాయులను భర్తీచేసి, అదనపు తరగతి గదుల పనులు పూర్తి చేయాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

మొక్కలు నాటి సంరక్షించాలి

గంభీరావుపేట: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, లింగన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గురువారం వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా పాఠశాలల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి వసంత, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

గంభీరావుపేట: మండల మున్నూరుకాపు సంఘం–2 నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా బోయన్నగారి లింగం, ఉపాధ్యక్షుడిగా శీల శంకర్, ప్రధాన కార్యదర్శిగా మేకార్తి భాను, కోశాధికారిగా గంధ్యాడపు శంకర్, సంయుక్త కార్యదర్శిగా బోయన్నగా శంకర్ ఎన్నికయ్యారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

కోనరావుపేట: మండలంలోని మామిడిపల్లిలో పలువురికి మంజూరైన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా అందజేశారు. గ్రామానికి చెందిన దర్శనాల స్వప్న, నూకలమర్రి మౌనిక అనారోగ్యంతో బాధపడుతూ సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకున్నారు. స్వప్నకు రూ. 10,500, మౌనికకు రూ. 9వేలు మంజూరయ్యాయి. గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. నాయకులు నంద్యాడపు సాగర్, గుమ్మడి అమృతరావు, మల్లారెడ్డి, జవ్వాజి రాములు, నార్ల ప్రేమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

కోనరావుపేట: పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయుల సేవలు మరవలేనివని మాజీ ఎంపీటీసీ దేవరకొండ నర్సింహచారి అన్నారు. ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సుల్తాన్ రాజు, వినయశీల, పీఈటీ దాసరి వనితను ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



బహుమతులు అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

రుద్రంగి: మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రుద్రంగి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జనాభా నియంత్రణపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గోడికార్ హిరోజీ మాట్లాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కోశాధికారి కొమిరె శంకర్, మాజీ అధ్యక్షుడు దేవేందర్, మంచె రాజేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కలదాడిలో గొర్రెలు మృత్యువాత



సిరిసిల్లటౌన్: వీధికుక్కలు దాడిలో 20 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..రగుడుకు చెందిన సిద్ధి కనుకయ్య అనే గొర్రెల కాపరి బుధవారం రాత్రి ఇంటిముందున్న షెడ్డులో 20 గొర్రెలను తోలాడు. వీధి కుక్కలు దాడి చేయడంతో అవి మృత్యువాతపడ్డాయని, రూ. 3 లక్షలు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం సాయం అందించాలని కనుకయ్య కోరుతున్నాడు.

విద్యార్థులకు అవగాహన

గంభీరావుపేట: మండలకేంద్రంలోని కేజీ టు పీజీ విద్యా సంస్థల్లో భాగమైన ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు జనాభా నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఆర్థిక శాస్త్ర విభాగం అధ్యాపకులు శ్రీనివాస్, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ఆంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధర్మపురి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ వాణి, టాస్క్ కన్వీనర్ శ్రావణ్, జంతు శాస్త్ర అధ్యాపకులు భిక్షమయ్య, లైబ్రేరియన్ సత్యానందం, కృష్ణప్రసాద్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీఐని సస్పెండ్ చేయాలి



వేములవాడ: ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల నిరసన కార్యక్రమానికి కవరేజ్‌కి వెళ్లిన జర్నలిస్ట్ చరణ్‌పై సీఐ రాజేందర్ దాడికి నిరసనగా వేములవాడలో అఖిలపక్ష నాయకులు గురువారం తెలంగాణ చౌక్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. తెలంగాణ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న మీడియాపై పోలీసులు దాడులు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ నాయకులు నిమ్మశెట్టి విజయ్, గోలి మహేశ్, ఈర్లపల్లి రాజు, వెంగళ శ్రీకాంత్‌గౌడ్, ముద్రగోల వెంకటేశం, అంజద్‌పాషా, బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడు రేగుల సంతోష్ బాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు, విద్యార్థి సంఘం నాయకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఘనంగా బండి సంజయ్ జన్మదిన వేడుకలు



సిరిసిల్ల టౌన్: సిరిసిల్లలో కేక్ కట్‌చేస్తున్న బీజేపీ నాయకులు

సిరిసిల్లటౌన్: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను సిరిసిల్ల పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ చేతులమీదుగా విశ్వనాథ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహాన్నదానం చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో, కోర్టు ముందు, పాతబస్టాండ్‌లో కేక్ కట్‌చేసి సంబరాలు జరిపారు. వైశ్య భవనంలో మహాన్నదానం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, జిల్లాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు. బీజేపీ సీనియర్ నాయకుడు ఆడెపు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, కౌన్సిలర్ బొల్గం నాగరాజుగౌడ్, శీలం రాజు, అన్నల్‌దాస్ వేణు, వేణు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలకేంద్రంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, మండలశాఖ అధ్యక్షుడు గొట్టె రామచంద్రం, నాయకులు వెలిశాల రవి, మధుబెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలకేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో బండి సంజయ్ జన్మదిన వేడుకలు జరిపారు. కొదురుపాక, నీలోజిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బీజేవైఎం మండల అధ్యక్షుడు కొనుకటి హరీశ్ నోట్ బుక్స్, పెన్నులు వితరణగా అందించారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని హనుమాన్ ఆలయంలో బీజేపీ నాయకులు ప్రత్యేక పూజలు చేసి మొక్కలు నాటారు. చిప్పలపల్లిలో స్వీట్లు పంపిణీ చేసి మొక్కలు నాటారు. పార్టీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్, ప్యాక్స్ డైరెక్టర్ యెల్ల గిరిధర్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, కామిటికార్ పద్మ, బాధ నరేశ్, వెంకన్న, జనార్దన్, గోపి, మహేందర్, రమేశ్‌రెడ్డి, అనిల్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగిలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నంద్యాడపు వెంకటేశ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు గణేశ్, రాజు, రవీందర్, బాలకిషన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పార్టీ మండల అధ్యక్షుడు గునుకుల దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కేంద్రమంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పటాకులు కాల్చి కేక్ కట్‌చేశారు. పార్టీ మాజీ మండల అధ్యక్షుడు మల్లేశం ,రాజు, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. మండల ప్రధాన కార్యదర్శి చందుపట్ల లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు నంది నరేశ్, వాణిజ్యసెల్ జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బందారపు లక్ష్మారెడ్డి, నాయకులు మానుక కుమార్‌యాదవ్, సంజీవరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సత్యం రెడ్డి, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని మండెపల్లి చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్ రావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి ఆధ్వర్యంలో వేర్వేరుగా బండి సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలో బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా నాయకులు కొక్కు దేవేందర్‌యాదవ్, ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

కొండూరి జన్మదిన వేడుకలు



ఎల్లారెడ్డిపేటలో కేక్ కట్‌చేస్తున్న సింగిల్‌విండో డైరెక్టర్లు, తదితరులు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో గురువారం డీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అంతకుముందు రవీందర్‌రావు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, డైరెక్టర్లు వెంకట నర్సింహారెడ్డి, సంగిడి సత్తయ్య, హసన్, నర్సింహులు, బందారపు బాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని గజసింగవరంకు చెందిన నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు జన్మదిన వేడుకలను గోరింటాల సాయిబాబా ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. మాజీ జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, మాజీ అధ్యక్షుడు దయాకర్‌రావు, రాజారాం, మాజీ ఎంపీటీసీ అంజిరెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ రామానుజాగౌడ్, మహిళా విభాగం నాయకురాలు పిట్ల శ్రీమతి, నాయకులు సురేందర్‌రెడ్డి, ఎల్లాగౌడ్, హరీశ్, శివయ్య, మహేశ్, ధన్‌రాజ్, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొండూరికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

మండల బీఆర్ఎస్ నాయకులు నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావును హైదరాబాద్‌లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండల నాయకులు గడ్డి హరీశ్, అభిలాష్, సత్యం, ఎగదండి రవి, సుధాకర్ ఉన్నారు.



గంభీరావుపేట: కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేటీఆర్‌ను కలిసిన నాఫ్కాబ్ చైర్మన్

సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కేటీఆర్‌ను నాఫ్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. రవీందర్ రావుకు కేటీఆర్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న ఆధ్వర్యంలో.. ఆపార్టీ రాష్ట్ర నాయకుడు మాజీ టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

తంగళ్లపల్లి: మండలకేంద్రంలోని రైతువేదికలో గురువారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్–2) సమావేశం నిర్వహించారు. ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల విద్యుత్ వినియోగదారుల కోసం ఏర్పాటుచేసిన వేదికలో సీజీఆర్ఎఫ్ చైర్‌పర్సన్ (ఎఫ్ఏసీ) మెంబర్ టెక్నికల్ ఎస్.రామకృష్ణ, ఫైనాన్స్ మెంబర్ ఎల్.కిషన్, పోర్త్ మెంబర్ ఎం.రాజాగౌడ్ విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. విద్యుత్ బిల్ అందించిన రోజువరకే బిల్ చూపించాలని అలాకాకుండా 31 రోజులకు బిల్ వచ్చేలా ఉన్న సాఫ్ట్‌వేర్‌ను మార్చాలని, దీంతో వినియోగదారులకు జీరో బిల్లు రాకుండా నష్టపోతున్నారని తెలిపారు.సెస్, ఎన్పీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

రేపు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

సాక్షి స్పందన

తంగళ్లపల్లి: మండలంలోని 30 గ్రామాలకు 178 కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరైనా పంపిణీలో జాప్యం చేస్తున్నారని తెలుపుతూ ఈనెల 6న 'చెక్కులివ్వండి మహాప్రభో..' అనే శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన రెవెన్యూ అధికారులు చెక్కులు పంపిణీకా సిద్ధమయ్యారు. శనివారం ఉదయం 10:30 గంటలకు రాజ ప్రవుల్లా రెడ్డి ఫంక్షన్ హాల్‌లో చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చేతులమీదుగా చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. చెక్కుల పంపిణీకి చొరవ చూపిన 'సాక్షి'కి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలిపారు.